మీ మాతృభాషను ఉపయోగించడం- తల్లిదండ్రుల సమాచార పత్రం

తల్లిదండ్రులు/సంరక్షకుల కోసం సమాచారం

పిల్లల విద్యలో తల్లిదండ్రులు మరియు సంరక్షకులది ఒక ముఖ్యమైన పాత్ర. ఈ సమాచార పత్రం, పిల్లల మాతృభాష (ల) ను కొనసాగించడం యొక్క ప్రాముఖ్యతను అర్థం చేసుకోవడంలో తల్లిదండ్రులకు మరియు సంరక్షకులకు మద్దతు ఇవ్వడానికి సలహాలను అందిస్తుంది.

బహుభాషా నైపుణ్యం యొక్క ప్రయోజనాలు

మీరు బహుభాషావేత్త అయితే, మీరు ఒకటి కంటే ఎక్కువ భాషలలో సంభాషించగలరని అర్థం. బహుభాషా నైపుణ్యం ఉన్న పిల్లలను పెంచడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి.

బహుభాషా మేధస్సు ఉండటం వల్ల మీ పిల్లల ఏకాగ్రత మెరుగుపడవచ్చు మరియు వారు వ్యాపకాల మధ్య మారడంలో మరింత నైపుణ్యం కలిగి ఉండవచ్చు. వాస్తవానికి, "పాఠశాలలో మరియు ఇంట్లో మాతృభాషలను కొనసాగించడం ఇంగ్లీషు నేర్చుకోవడానికి ఆటంకం కలిగించదు [కానీ] ఇంగ్లీషు నేర్చుకోవడానికి ఇది ఒక కీలకమైన సాధకము" అని పరిశోధనలు చూపిస్తున్నాయి (హెర్ట్జ్‌బర్గ్ & వాల్డెజ్, 2026, పేజీ. 20). దీని కారణంగా, ఇంగ్లీషు తో పాటు, తమ మాతృభాషను కూడా నేర్చుకొనే పిల్లలు, ఇంగ్లీషు నేర్చుకుని తమ మాతృభాషను మరచిపోయిన విద్యార్థుల కంటే తరువాత సంవత్సరాలలో ఉన్నత విద్యలో విజయాలు సాధించడానికి మెరుగైన అవకాశాలను కలిగి ఉంటారు. తల్లిదండ్రులు మరియు సంరక్షకులు తమ పిల్లలతో వారి మాతృభాషలలో మాట్లాడటానికి, సాధ్యమైన చోట చదవడానికి మరియు వ్రాయడానికి ప్రోత్సహించబడతారు.

గుర్తింపు మరియు అనుబంధ భావన

మీ పిల్లలను బహుభాషావేత్తలుగా పెంచడం వల్ల, వారు తమ సంస్కృతి మరియు వారసత్వం యొక్క ప్రాముఖ్యతను గుర్తించడంలో, అలాగే బలమైన వ్యక్తిగత గుర్తింపును పెంపొందించుకోవడంలో సహాయపడవచ్చు. మరో భాషను అర్థం చేసుకోవడం మీ పిల్లలు మీ మాతృభాషను మరియు సంస్కృతిని మరింత బాగా అర్థం చేసుకోవడానికి తోడ్పడుతుంది. బహుభాషావేత్తగా ఉండటం, మీ సంస్కృతికి చెందిన ఆచారాలు, ఆలోచనలు మరియు దృక్కోణాలపై అవగాహనను బలపరుస్తుంది.

ఆంగ్లం నేర్చుకోవడం

మీ పిల్లలు ఇంకా ఇంగ్లీషులో మాట్లాడటం, చదవడం మరియు వ్రాయడం నేర్చుకుంటున్నట్లయితే, వారు అదనపు భాష/మాండలికంగా ఇంగ్లీష్ (EAL/D) నేర్చుకునేవారు. వారి ఇంగ్లీషు భాషా నైపుణ్యం మరింత అభివృద్ధి చేసుకోవడంలో సహాయపడటానికి మీ పిల్లలకు పాఠశాలలో అదనపు మద్దతు ఇవ్వవచ్చు. దీని అర్థం, వారు పాఠశాలలో ఇంగ్లీష్

సెప్టెంబర్ 2021లో ప్రచురించబడింది, మే 2026లో సవరించబడింది

భాషలో నిపుణులైన EAL/D ఉపాధ్యాయులతో కలిసి పనిచేయవచ్చు లేదా అవసరమైనప్పుడు మీ పిల్లల ప్రధాన ఉపాధ్యాయులు తరగతి గదిలో అదనపు సహాయం అందించవచ్చు.

ఆంగ్లం నేర్చుకోవడానికి సమయం పడుతుంది మరియు మీ బిడ్డ వారి స్వంత పంథాలో పురోగమిస్తుంది. వారితో మీ మాతృభాషను మాట్లాడటం కొనసాగించడం ద్వారా మీరు మీ పిల్లలకు సహాయం చేయవచ్చు. ఇంగ్లీషు లేదా మరో భాషను నేర్చుకునేటప్పుడు మీ మాతృభాషను కొనసాగించడం చాలా సహాయకరంగా ఉంటుందని నిపుణులు కనుగొన్నారు. ఇంట్లో మీ స్వంత భాషను ఉపయోగించడం వల్ల ఇంగ్లీషు నేర్చుకోవడం సులభతరం అవుతుంది, ఎందుకంటే ఒక భాషలో నేర్చుకున్న భావనలు తరచుగా మరొక భాషకు బదిలీ చేయబడతాయి.

అనువాద సేవలను ఉపయోగించడం

మీ పిల్లల పాఠశాలను సంప్రదించడానికి మీరు ఇంగ్లీషులో మాట్లాడాల్సిన అవసరం లేదు. ఒకవేళ ఇంగ్లీషు మీ మొదటి భాష కాకపోయి, మీ సొంత భాషలో మాట్లాడటం మీకు సౌకర్యంగా అనిపిస్తే, మీరు పాఠశాలను ఒక భాష్య కారుని (అనువాదకుని) కోసం అడగవచ్చు. దీనికి మీరు ఎలాంటి ఖర్చు చెయ్యాల్సిన అవసరం లేదు. పాఠశాలలు కుటుంబాల కోసం ఫోన్ అనువాద సేవలను అందిస్తాయి. మీకు లేదా మీ కుటుంబ సభ్యులకు పాఠశాలతో మాట్లాడటానికి సహాయం అవసరమైతే, మీరు ఈ సేవను అడగవచ్చు. ఈ సేవ మీకు ఈ క్రింది విషయాలలో సహాయపడుతుంది:

- తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమావేశాలలో
- ఇంగ్లీషులో వ్రాసిన పాఠశాల నివేదికను అర్థం చేసుకోవడానికి
- మీకు చదవడం రాని పత్రంపై సంతకం చేయమని అడిగినప్పుడు
- మీ పిల్లల యోగక్షేమాల గురించిన సమావేశాలలో



ఇంట్లో మీ పిల్లలకు ఎలా సహాయం చేయాలి

మీ మాతృభాషలో చదవడం, వ్రాయడం నేర్చుకోవడం వలన మీ పిల్లలు కూడా ఇంగ్లీషులో చదవడం, వ్రాయడం నేర్చుకోవడానికి సహాయపడుతుంది. పిల్లలు ఇంగ్లీషులోని అంశాలను నేర్చుకోవడానికి, అర్థం చేసుకోవడానికి వారి మాతృభాషలోని నైపుణ్యాలను ఉపయోగిస్తారు.

ప్రయత్నించవలసినవి:

- ప్రతిరోజూ మీ పిల్లలతో మీ మాతృభాషలో సంభాషించండి. ఇది మీ మాతృభాషను కాపాడుకోవడానికి మరియు మీ పిల్లలతో మీ సంబంధాన్ని బలంగా ఉంచుకోవడానికి సహాయపడుతుంది.
- మీ పిల్లలతో కలిసి మీ మాతృభాషలో పుస్తకాలు చదవండి మరియు టీవీ కార్యక్రమాలు చూడండి. ఇది విద్యా సంబంధమైనది కానవసరం లేదు, సరదా కోసం ఈ పనులు చేయడం కూడా ముఖ్యం.

సెప్టెంబర్ 2021లో ప్రచురించబడింది, మే 2026లో సవరించబడింది

act.gov.au

ACT Government

- మీ చిన్ననాటి పాటలను, కథలను పంచుకోండి. కుటుంబాలు వారి తరువాత తరాలకు అందించడానికి గొప్ప వారసత్వం ఉంటుంది మరియు పిల్లలు తమ తల్లిదండ్రులు, సంరక్షకుల బాల్యం గురించి విని ఆనందిస్తారు.
- మీ స్థానిక గ్రంథాలయాన్ని సందర్శించండి. ACT గ్రంథాలయాలలో అరువు తీసుకోవడానికి అనేక భాషలలో పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి మరియు చిన్న పిల్లలు, వారి తల్లిదండ్రుల కోసం ద్విభాషా కథా కార్యక్రమాలు కూడా జరుగుతాయి.
- ఆడియో పుస్తకాలను ఇంగ్లీషులో మరియు మీ మాతృభాషలో వినండి.
- మీ సంస్కృతి, సంప్రదాయాలను పంచుకోండి. సంస్కృతి, సంప్రదాయాలను పంచుకోవడంలో తల్లిదండ్రులు, సంరక్షకులు పోషించే పాత్రకు ఉపాధ్యాయులు విలువ ఇస్తారు మరియు తరగతి గదికి వచ్చే సందర్శకులను స్వాగతిస్తారు. మీరు మీ పిల్లల ఉపాధ్యాయునితో మాట్లాడి, తరగతిలో అందరితో కలిసి ఒక పుస్తకాన్ని లేదా కథను పంచుకోవడానికి ఏర్పాటు చేసుకోవచ్చు.
- సమాజంలో జరిగే కార్యకలాపాల కోసం వెతకండి. ACTలో సంవత్సరం పొడవునా అనేక సాంస్కృతిక కార్యక్రమాలు మరియు కార్యకలాపాలు జరుగుతాయి. మీ మాతృభాష మాట్లాడే ఇతర కుటుంబాలను కలవండి లేదా మీ స్వంత కార్యక్రమాన్ని ప్రారంభించడానికి ఇతర కుటుంబాలతో చేరండి.
- మీ పిల్లలు పెద్దవారవుతున్న కొద్దీ మీ మాతృభాషను ఉపయోగించడం కొనసాగించండి. కొన్నిసార్లు పిల్లలు వయసు పెరిగే కొద్దీ ఇంగ్లీషు మాట్లాడటానికి ఇష్టపడతారు. రెండు (లేదా అంతకంటే ఎక్కువ) భాషలు నేర్చుకోవడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి మీ పిల్లలతో మాట్లాడండి. మీ మాతృభాషలో మాట్లాడటం కొనసాగించండి మరియు దానిని ఉపయోగించడానికి కట్టుబడి ఉండండి, ఎందుకంటే మీ మాతృభాష మరియు సంస్కృతి గర్వించదగిన విషయాలు.

ప్రమాణ పత్రాలు

హెర్ట్జ్‌బర్గ్, ML, & వాల్డెజ్, C. (2026). ప్రధాన తరగతి గదులలో EAL/D విద్యార్థులకు బోధించడం (2వ ఎడిషన్). ప్రైమరీ ఇంగ్లీష్ టీచింగ్ అసోసియేషన్ ఆస్ట్రేలియా (PETAA).

సెప్టెంబర్ 2021లో ప్రచురించబడింది, మే 2026లో సవరించబడింది